క్లుప్తంగా

అప్రకటిత కోతలతో సతమతం

నెహ్రూనగర్: నగరంలోని 54వ డివిజన్‌లో అప్రకటిత కరెంట్ కోతలతో డివిజన్ వాసులు సతమతమవుతున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి కరెంట్ పోయి మధ్యాహ్నం 2.45 గంటలకు వచ్చింది. ఒక పక్క ఉక్కపోత మరో పక్క కరెంట్ కోతలతో డివిజన్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారంలో ఇదే విధంగా రెండు, మూడు రోజులు కరెంట్ కోతలు విధిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిపుచ్చుకోవచ్చునని బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభ పేర్కొన్నారు. బుధవారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో ఈషా ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణప్రభ మాట్లాడుతూ జూన్ 21వ తేదీని ప్రతిఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంతటి గుర్తింపు కలిగిన యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేస్తూ, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. డిగ్రీ కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ మనదేశంలో కొన్ని వేల ఏళ్ల క్రితం నుంచి యోగాను అభ్యసిస్తున్నారని, ప్రస్తుతం పంచ దేశాల్లో 'యోగా' బాగా ప్రాచుర్యం పొందుతోందని అన్నారు. యోగాను మంచి నిపుణుల వద్ద అభ్యసించడం వలన మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర సూచించారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 1, 3, 57 వార్డుల్లో రూ.85.08 లక్షలతో అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఈఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.

దీప్తిశ్రీకి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు విభాగ పరిశోధకురాలు వల్లూరి దీప్తిశ్రీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. తెలుగు విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య ఎస్‌వీ కృష్ణారావు పర్యవేక్షణలో 'తెలుగు చలన చిత్రాలలో ఆంగ్లభాషా పద ప్రయోగాలు - పరిశీలన(2001-2020)' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించగా దీప్తిశ్రీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.

21న పోలీస్ పరేడ్ గ్రౌండ్ యోగా దినోత్సవం

నెహ్రూ నగర్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమయ్యే జిల్లా స్థాయి యోగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని వివరించారు.

వాణిజ్య వాహన రంగంలో ఉద్యోగావకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యావంతులైన యువతకు వాణిజ్య వాహన రంగంలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ డెప్యూటీ మేనేజర్ ధీరజ్ అన్నాప్రగడ పేర్కొన్నారు. బుధవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థుల కోసం వోల్వో ఐషర్ సంస్థ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో నేరుగా ముఖాముఖీ చర్చల వలన పరిశ్రమలతో అనుసంధానం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు సిహెచ్ వైష్ణవి, సిహెచ్ వేణుమాధవ్, ఏ. బాజీబాబు, వి.అలీషా, అనిత, రాజేశ్వరి దేవి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు జననీరాజనం

- గుంటూరు మీదుగా రెంటపాళ్ల వెళ్లిన మాజీ సీఎం
- నగరంలో ఘనస్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వచ్చిన మధులిక బాయి

నెహ్రూనగర్: గుంటూరు నగరం మీదుగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గుంటూరు నగర శివారు ప్రాంతమైన కృష్ణబాబు కాలనీ నుంచి నల్లపాడు వరకు జననీరాజనంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన నాయకుడ్ని చూసేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా బారులు తీరారు.

సీఎం సీఎం అంటూ నినాదాలు

గుంటూరు నగరంలోకి అడుగుపెట్టిన కార్యకర్తలు, అభిమానులు సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. కృష్ణబాబు కాలనీ వద్ద కార్పొరేటర్లు కంద్రకుంట గురవయ్య, దూపాటి వంశీబాబు, మొహమూద్, అబీద్, అజయ్, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలు బాణసంచా కాల్చారు. సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. చిన్నారులను వైఎస్ జగన్ ఎత్తుకుని ముద్దులు పెట్టారు. చుట్టుగుంట సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే డీజే సుధాకర్‌బాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మందపాటి శేషగిరితో ఇతర ముఖ్య నాయకులు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. 29వ డివిజన్ సాయినగర్ వద్ద కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎన్‌జీఓ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ పడాల సుబ్బారెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు, భారీ బాణసంచా కాల్చారు.

బాలికను అండగా వైఎస్ జగన్

గుంటూరు నగరం కేవీపీ కాలనీకి చెందిన జనవాత్ మధులిక బాయి 8 ఏళ్ల నుంచే ఎస్ఎంఏ(స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ) అనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. గత ప్రభుత్వ హయాంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, బాలిక వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం తరఫున అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ వైద్య ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పాప వీల్‌చైర్‌కే పరిమితమైంది. ప్రస్తుతం పాపకు రూ.13 లక్షలు ఖర్చు అయ్యే రెండు డోస్‌ల ఇంజెక్షన్లు వేస్తే పాపకు కొంచెం ఆరోగ్యం కుదుపడుతుందని డాక్టర్లు చెప్పారని పాప తండ్రి వెంకటేష్ నాయక్ వివరించారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో వైద్యం చేయించుకోలేదని చెబుతున్నారు. బుధవారం గుంటూరు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసేందుకు కృష్ణబాబు కాలనీ వద్దకు వచ్చారు. వైఎస్ జగన్‌ను కలిసి పాప ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన వైఎస్ జగన్ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ని పిలిచి పాప ఆరోగ్య పరిస్థితిని చూడాలని సూచించారు.

కనిపించని పోలీసు బందోబస్తు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సత్తెనపల్లి వెళుతున్న క్రమంలో గుంటూరులో పోలీసు బందోబస్తు కనిపించలేదు. ఏ పాయింట్‌లో చూసిన ఒకరు ఇద్దరు పోలీసులే తప్ప ఆశించిన స్థాయిలో బందోబస్తు కనిపించలేదు. ఆ పోలీసులు కూడా జగన్‌ను చూసేందుకు వచ్చిన వారిని వీడియోలు తీస్తు కనిపించారు. గుంటూరు నగరంలోనే సుమారు రెండు గంటలకు పైగా వైఎస్ జగన్ పర్యటన సాగింది.



ప్రత్తిపాడు- ఏటుకూరు బైపాస్ వద్ద అశేష జనసందోహం

జననేతకు ఘన స్వాగతం

- జగనన్నకు అట్టహాసంగా స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- కరచాలనం చేసేందుకు ఎగబడ్డ అభిమానులు
- చిరునవ్వుతో అభివాదం చేసుకుంటూ ముందుకు సాగిన వైఎస్ జగన్



వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గం మీదుగా బుధవారం ఉదయం పల్నాడు జిల్లా పర్యటనకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ నేతృత్వంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై నుంచి సర్వీసు రోడ్డులోకి జగన్ కాన్వాయ్ వచ్చింది. దీంతో జగన్‌ను చూసేందుకు అభిమానులు, పార్టీ శ్రేణులు పరిగులు పెట్టారు. జగన్ కారుపై నుంచే ప్రజలకు చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. దారిపొడవునా అభిమానులు కాన్వాయ్‌పై పూలు చల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు. రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన జగన్ ఫ్లెక్సీలకు యువకులు క్షీరాభిషేకం చేశారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు మండలాల నుంచి ఎద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు జగన్ కాన్వాయ్ గుంటూరు నగరంలోనికి ప్రవేశించే వరకు ఇరువైపులా రక్షణగా నడిచారు. యువత, పార్టీ నాయకులు భారీ ద్విచక్రవాహన ర్యాలీతో జగన్‌ను స్వాగతించారు.



జగనన్న కోసం ప్లకార్డులతో వేచివున్న నాయకులు, కార్యకర్తలు

పొన్నూరు: పల్నాడు జిల్లా పర్యటనకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పొన్నూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బుధవారం ఉదయం పెదకాకాని మండలం పరిధిలోని ఆటో నగర్ సమీపంలోని హైవేపై ఏర్పాటు చేసిన శిబిరం వద్ద తమ అధినేత జగనన్నపై అభిమానంతో ఆయనకు స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో నియోజకవర్గం నుంచి తరలివచ్చారు. జగనన్న రాగానే కరచాలనం కోసం వందల మంది కార్యకర్తలు పోటీపడ్డారు. పర్యటనలో పాల్గొనేందుకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పొన్నూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, షేక్ మాము, చింతలపూడి మురళీకృష్ణ, షేక్ పీర్, బోయిన శివశంకర్, దేవరకొండ గోపి, ఎందేటి వెంకట సుబ్బయ్య, పెదకాకాని, చేబ్రోలు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు వెళుతున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని పిలుపు మేరకు నల్లపాడు గ్రామంలోని ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి పార్టీ శ్రేణులను కలుపుకొని భారీగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలకు, మంచినీరు పంపిణీ చేశారు. అదే విధంగా సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామంగా భారీ బాణాసంచాను పేల్చి జగనన్నకు ఘన స్వాగతం పలికారు. జగన్ రావడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం జైజగన్.. జైసీఎం అంటూ నినాదాలతో మార్మోగింది. అభిమానులకు అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగారు. మండల వ్యాప్తంగా మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పిలుపుతో పార్టీ నాయకులు తరలివచ్చారు. వేలాదిగా స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజలు జగనన్నను చూసి పట్టరాని సంతోషం వ్యక్తం చేశారు.

ఓబీసీ మహిళల సబ్ కోటా ఎంతో ముందే తేల్చాలి

కేసన శంకరరావు

నెహ్రూనగర్: మహిళలకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటు చేసిన చట్టాన్ని వెంటనే సవరించి, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళకు ఎంత సబ్ కోటా ఇస్తారో కేంద్ర ప్రభుత్వం ముందే తేల్చాలని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023లో 128 వ రాజ్యాంగ సవరణ చేసి, 33 శాతం చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చేలా కేంద్రం చట్టం చేయడం సంతోషదాయకమేనన్నారు. కానీ భారతీయ కుల సమాజంలో ఎస్సీ, ఎస్టీ మహిళల మాదిరిగానే ఓబీసీ మహిళలు కూడా ఆధిపత్య కుల పెత్తందారి వర్గాల మహిళలతో ఏ మాత్రం చట్ట సభల ఎన్నికలలో పోటీ పడలేరన్నారు. ఇప్పుడున్న మహిళా రిజర్వేషన్ చట్టాన్ని యథాతథంగా అమలు జరిపితే, ఆధిపత్య వర్గాల మహిళలతోనే పార్లమెంట్ నూరు శాతం నిండిపోతుందన్నారు. అన్ని రంగాలలో అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న అణగారిన వర్గాలకు చెందిన ఓబీసీ మహిళలకు, మహిళా రిజర్వేషన్లలో సబ్ కోటాను ముందే తేల్చాలని దేశవ్యాప్తంగా ఓబీసీ సంఘాలు కోరుతున్నాయని చెప్పారు. 2027 డిసెంబర్ చివరికల్లా జనగణనతో పాటు సమగ్ర కుల గణన కూడా పూర్తవుతున్న నేపథ్యంలో..అదే విధంగా దేశవ్యాప్తంగా పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసన సభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కాగానే, 2029 ఎన్నికలలో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే లోపే, చట్టసభలలో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించి, ఓబీసీ మహిళకు సబ్ కోటా ఏర్పాటు చేయాలని కోరారు.


తెగిన శరీర భాగాలను అతికించవచ్చు



తెగిన చేతిని అతికించిన మహిళతో డాక్టర్ బిందేష్

గుంటూరు మెడికల్: ప్రమాదవశాత్తు శరీరం నుంచి తెగిపోయిన శరీర భాగాలను అతికించి ప్రాణాలు కాపాడే అత్యాధునిక చికిత్సలు తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని విశ్వభారతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హ్యాండ్ అండ్ మైక్రోసర్జరీ సెంటర్ అధినేత హ్యాండ్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ దాడి బిందేష్ అన్నారు. బుధవారం గుంటూరు కొత్తపేటలోని హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం వివరాలు వెల్లడించారు. ఏప్రిల్‌లో బాపట్లకు చెందిన 21 ఏళ్ల యువతికి ట్రాక్టర్ చక్రంలో కుడిచేయి పడి భుజం వరకు తెగిపోతే ఆపరేషన్ చేసి చేతిని యథాస్థితికి తెచ్చినట్లు వెల్లడించారు. హ్యాండ్ సర్జరీలు తక్కువ ధరలో సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో తమ ఆస్పత్రిలో చేస్తున్నామని, బాధితులు వైద్యసేవలు వినియోగించుకోవాలని డాక్టర్ బిందేష్ కోరారు.

నూతన ఆటో స్టాండ్ యూనియన్ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పశ్చిమ వైపున ఏర్పాటు చేసిన నూతన ఆటో స్టాండ్ యూనియన్ ప్రథమ మహాసభ బుధవారం నిర్వహించారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించిన మహాసభకు యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జంగాల అజయ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర గౌరవాధ్యక్షుడు కోట మాల్యాద్రి పాల్గొన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, నిరుద్యోగం పెరగడంతో యువత ఆటోరంగాన్ని ఆశ్రయిస్తున్నారని వారు అభిప్రాయపడ్డారు. ఆటో కార్మికులకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాండ్ అధ్యక్షుడిగా శివగౌడ్, కార్యదర్శిగా శివకృష్ణను ఎన్నుకున్నారు. 11 మందితో కూడిన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షుడు కూరాకుల రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎండీ బాబార్ పాల్గొన్నారు.

మహాభారతంలోని అరణ్యపర్వంపై ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి ప్రవచనం వినిపించారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసుల దాడి దుర్మార్గం



శ్రీ చైతన్య కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ఆరోపించారు. గుంటూరు చంద్రమౌళినగర్‌లోని శ్రీ చైతన్య కళాశాల ముందు విజయవాడలో విద్యార్థి సంఘ నాయకులపై పోలీసుల దాడికి నిరసనగా బుధవారం నిరసన తెలిపారు. కళాశాల ముందు కొద్ది సేపు నినాదాల హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, ఇతర కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో అక్రమంగా పాఠ్యపుస్తకాలు యూనిఫాం పేరుతో రూ.వేలకు వేలు విద్యార్థుల దగ్గర నుంచి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ నాయకత్వంలో విజయవాడ బందర్ రోడ్డులో ఉన్న శ్రీచైతన్య ఇందిరా టవర్స్‌లో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు దాడి చేసి కేసులు పెట్టడం చాలా దుర్మార్గం అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలో జరుగుతున్నటువంటి విద్యా దోపిడీని అరికట్టకపోతే ఇలాంటి అక్రమ కేసులు ఎన్ని పెట్టిన ఆ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ముందే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర కార్యదర్శి ప్రణీత్(బన్నీ) నగర నాయకులు అజయ్, వెంకట్, అజయ్ కుమార్, డేవిడ్, సాగర్ , కిరణ్, రాహుల్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు ఉద్యోగోన్నతులపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజావలితో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం ఖాజావలి, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు కె.జవహర్‌బాబు, డి.శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరావు, షేక్ జకియా భాను, ఎం.లక్ష్మీ ప్రసన్నను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. హెచ్ఎం ఖాజావలి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని, టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు సమష్టిగా ముందుకెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు బొనిగల హైమారావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు ఏఎం ప్రసన్నజ్యోతి, ఎ.ఇందిర, ఎం.శివన్నారాయణ, జె.సాయి మల్లికార్జున, ఎంపీ సుబ్బారావు, ఎస్.ప్రేమ్ సాగర్, టి.రవి, డి.తిరుపతిరెడ్డి, కె.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బదిలీల జీఓ 05ను సవరించాలి



నెహ్రూనగర్: వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల కోసం ఇచ్చిన జీఓ 05ను సవరించాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ విన్నవించారు. ఈ మేరకు బుధవారం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాల్లో పనిచేస్తున్న ఆఫీస్ బేరర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలని, ప్రస్తుతం జరగనున్న బదిలీలు అత్యంత పారదర్శకంగా జరపాలని కోరారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE: GUNTUR

I.P No: 27 /2024

BETWEEN :
1)PuletikurthiKishore. S/o.Nageswara Rao,
2)Puletikurthi Trinath, S/o.Nageswara Rao. Both are R/o. D.No.16-32-43, Mallayya Lingaiah Nagar, 3rd Line, Guntur. ....Petitioners

and

1)Alapati Chandra Sekhar.S/o.A.Venkata Ramana,Resnanzo Restaurant , Lakshmi Puram Main Road, Centro 3rd Floor, Guntur.2)Koturthi Anil Kumar.Pandu Complex, Gantalamma Chettu, Lalapet, Guntur,3)Perumalla Murali Krishna Reddy,Universal Scan centre, Beside Needs Blood Bank, Near Santhosh Honda Show Room. Kothapet, Guntur.4) Naam Hair Shenshah, S/o. Real Raj. Prop. of Real Jewellers, Golden Plaza. 3rd Shop, Beside Swathi Hotel. Lalapet,Guntur,5) Ramesh, Sri Rajya Lakshmi Jewelers,Bus Stand Back Side, Cumbum-523332 Prakasam Dist.,6)A. Bala Chenna Reddy,ABC Jewellers, Beside Bus Stand, Cumbum, Prakasam Dist.,7) Suresh Duggyala,Lakshmi Venkateswara Jewelers, Shara Bazar, Opp. Railway Station, Giddalur.Prakasam Dist.,8)Chittala Suresh Reddy, Flat No. 106, Omega Block, Kokapet, Raja Pushpa Towers, Hyderabad,9)Hyundai Kishore. Kishore Jewellers Mart. Beside Sankar Vilas Hotel, Brodipet, 4th Line. Guntur.10)Sakala Ramesh. Sakala Anjaneyulu Jewellers, D.No.21-2-105. Flower Market, Cloth Bazar, Lalapet, Guntur,11)Deepu Praja Pet,Darshan Gold Works, D.No.21-3-75. Gantalamma Chettu, Lalapet, Guntur,12)Boga Dasaradhi,Employee in AKR Jewelers, 4th Line Brodipet., Guntur.13)Rajesh Bazar. Prop.of Micro Gold Testing, D.No.21-12-33, Gantalamma Chettu, Lalapet, Guntur,14) Dharla Phani Kumar,D. No.73-9-9/1-20. Tilak Road, Postal Colony, Rajahmundry,15)Sk. Moom Vali, D.No.52-52/516, Beside Madras Bilal Hotel. GunturuvariThota. Guntur.16) Badam Dhina Dayalu Gupta, Bus Stand Back Side, Cumbum, Prakasam Dist.17)Kakumanu Nageswara Rao.Flat No. 204, Sakhambari Apartment, Priyanka Gardens, Amaravathi Road, Guntur.18)Kolisetty Kolesh, S/o. Kolisetty Subramanyam, Vijaya Durga Jewelers, Chilakaluripet, Guntur Dist.19) Ankith Jain, G.S. Jewelers, Flower Market,Cloth Bazar, Lalapet. Guntur.20) Akula Bala Krishna, Proprietor of Akula Balakrishna Jewelers, D.No.21-12-15, Lalapet, Guntur.21) Vedurupalli Vasu. D. No.77-607/1, Pandu Complex, Near Gantalamma Chettu, Lalapeta. Guntur,22)Laviti Sankar, S/o. Babji, D. No.77/607/1. Pandu Complex, Near Gantalamma Chettu, Lalapeta. Guntur.23) Adi Seshu,Sri Venkateswara Jewellers,D.No.77-12-597 SVS Complex, Shop. No.2, Near Gantalamma Chettu,Lalapeta, Guntur,24) Mani Kumar. D. No.77-12-597, SVS Complex. Shop. No.2, Near Gantalamma Chettu, Lalapeta. Guntur.25)Shaik Abdul Rehman, D.No.55-99-82, 9/7 Line. Anand Pet, Ponnur Road, Guntur,26)Gandhisila Pavan Kalyan, S/o. Mohan, Gandhisila Jewelers, Pedakurapadu, Amaravathi Mandal, Palnadu Dist.27) Kasireddy Eswara Reddy, S/o. Lakshmi Reddy, Prop. Of Reddy Jewelers, Main Bazar. Cumbum, Prakasam Dist.28)The Official Receiver, District Court Complex, Guntur. ...Respondents

[illegible] 04-07-2025 [illegible] 10:30 [illegible] (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా తేది: 04-07-2025.

V. ANNAPURNA, Advocate for Petitioners
Gujjanagundla, Guntur, Cell:9491610840